క్లుప్తంగా

మహిళలకు ఆటల పోటీలు

మదనపల్లె సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందుస్తుగా స్థానిక ఎన్జీవో హోం లో ఆదివారం మహిళా ఉద్యోగులకు ఇండోర్‌గేమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలువురు మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందినవారికి మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఎన్జీవో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు దీప, అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

మదనపల్లె: పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.26,740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా ఎస్.ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు..కోళ్లబైలు పంచాయతీ వాటర్‌ఫాల్స్ సమీపంలో ఆదివారం నిర్వహించిన పేకాట శిబిరంపై తాలూకా పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో పట్టుబడిన జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె: కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె పంచాయతీ కనికలతోపుకు చెందిన ఖాదర్‌వల్లి (55) ఆదివారం ద్విచక్రవాహనంలో కురబలకోటలో ఉన్న కుమార్తె పర్వీన్(30) ఇంటి కొచ్చాడు. ఈ నేపథ్యంలో తండ్రి, కుమార్తెతో పాటు పర్వీన్ కుమార్తె అయేషా(10) సొంత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలు దేరారు. దారిలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో వీరు ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటు సారా స్వాధీనం

–ఆటో, మూడు ద్విచక్రవాహనాలు సీజ్

మదనపల్లె: మదనపల్లె పట్టణం నక్కలదిన్నె తాండాల్లో ఆదివారం డీఎస్పీ కేశప్ప ఆదేశాల మేరకు సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, ఎస్ఐలు కలిసి ఆదివారం నాకా బందీ నిర్వహించారు. 781 నాటుసారా ప్యాకెట్లు, 500 లీటర్ల నాటు సారా, 253 కర్నాటక టెట్రా ప్యాకెట్లు, 200 కేజీల బెల్లం,350 కేజీల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు.ఇందులో ఆటోతో పాటు మూడు ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిహరప్రసాద్, చంద్రమోహన్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

పీలేరు రూరల్ : పది లీటర్ల సారాతోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని తలపుల పంచాయతీ వడ్డిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పి. రాజశేఖర్ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, పీసీలు సుధాకర్, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

7న లక్ష్మీ నరసింహస్వామికి పూజలు

మదనపల్లె సిటీ: కదిరి పున్నమి పురస్కరించుకుని స్థానిక శ్రీవారినగర్‌లో వెలసిన శ్రీ అభయ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

మామిడితోటకు నిప్పు

రామసముద్రం: రామసముద్రం మండలం మినికి గ్రామ సమీపంలోని సర్దార్ మామిడితోటకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పటించారు. దీంతో తోట మంటల్లో చిక్కుకొని కూలి పోతుండటంతో స్థానికులు గమనించి పుంగనూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సుబ్బరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో 30 మామిడిచెట్లు, 10 నీలగిరి చెట్లు, అగ్నికి కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

గర్నిమిట్ట యల్లమ్మకు ప్రత్యేక పూజలు



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. గర్నిమిట్ట పరిసర గ్రామాల నుంచి భక్తులు మంగళ వాయిద్యాల నడుమ బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వేగంగా పక్కా గృహ నిర్మాణాలు

- తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు 39,125 ఇళ్లు మంజూరు
- 8,134 గృహ నిర్మాణాలు పూర్తి
- లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.266.16 కోట్ల చెల్లింపులు



మదనపల్లె రూరల్ మండలం నిమ్మనపల్లె రోడ్డు లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలు

బి.కొత్తకోట: జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించి పక్కా గృహాలను మంజూరు చేసింది. గూడులేని పేదలకు ఇళ్లు ఇవ్వడంతో నిర్మాణాలు వేగవంగా సాగుతున్నాయి. ఉగాదికి కొత్తగా గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ పీఎస్ గిరీషా, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి శివయ్యలు ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నిర్మాణాలు వేగవంతం చేయిస్తున్నారు. శివయ్య నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించి కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. దీనితో పనుల్లో పురోగతి సాధిస్తున్నారు. గ్రామ సచివాలయం, మండలస్థాయిలో నిర్మాణ లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

8,134 నిర్మాణాలు పూర్తి

మూడు నియోజకవర్గాల్లో ప్రభుత్వం 39,125 పక్కా గృహాలను పేదలకు మంజూరు చేసింది. ఇందులో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 29,537 గృహాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. ఇందులో శనివారం నాటికి 8,134 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతుండగా అందులో రూఫ్‌కాస్ట్ స్థాయిలో 2,064 ఇళ్లున్నాయి. ఈ ఇళ్లన్నీ కొన్ని రోజుల్లో పూర్తికానున్నాయి. నిర్మాణాల స్థితిని పరిశీలిస్తే..రిజిస్ట్రేషన్ జరిగి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కానివి 439 ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ స్థాయిలో 6,669, బేస్‌మెంట్ స్థాయిలో 8,681, రూఫ్ లెవల్‌లో 3,550, రూఫ్‌కాస్ట్ స్థాయిలో 2,064 గృహాలు ఉన్నాయి.

ఇళ్ల నిర్మాణాల తాజా స్థితి						
నియోజకవర్గం	రిజిస్టర్ గృహాలు	బిబిఎల్	బిఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి
మదనపల్లె	14,479	2,417	4,955	1,413	544	4,903
పీలేరు	3,467	222	1,019	513	308	1,393
తంబళ్లపల్లె	11,591	4,030	2,707	1,624	1,212	1,838

రూ.266.16 కోట్ల చెల్లింపులు

మూడు నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.266.16 కోట్లు ఖర్చు చేసింది. నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులను చెల్లిస్తోంది. లబ్ధిదారులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు ఇంటి సామాగ్రి కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా తక్కువ ధరకే నాణ్యమైన మెటీరియల్ అందిస్తోంది.

పేదలందరికీ పక్కా ఇళ్లు



ఇళ్లు లేని పేదలు ఉండకూడదని ప్రభుత్వం అర్హులందరికీ పక్కా గృహం మంజూరు చేసింది. గత ప్రభుత్వాలు అరకొర గృహాలు మంజూరు చేస్తే..వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు విలువవైన ఇళ్ల స్థలం కేటాయించి పక్కా గృహం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80లక్షలు తిరిగి చెల్లించే అవసరం లేకుండా ఉచితంగా ఇళ్లు నిర్మిస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు కనిపించకుండా కృషి చేస్తున్నాం.

-పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ఉగాదికి గృహ ప్రవేశాలు



పేదలు నిర్మించుకున్న ఇళ్లలోకి ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించేలా కలెక్టర్ ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీని కోసం గ్రామస్థాయి నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టాం. లబ్దిదారుల్లో అవగాహన కల్పించడంలో అధికారులు ఫలితాలు సాధిస్తున్నారు. దీనికోసం క్షేత్రస్థాయిలో పరిశీలినలు నిర్వహిస్తూ నిర్మాణాల వేగం పెంచుతున్నాం.

-ఎస్.శివయ్య, గృహనిర్మాణశాఖ జిల్లా అధికారి

విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

కలికిరి: విశ్రాంత ఉద్యోగులందరూ త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నేత సురేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం కలికిరిలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర స్థాయిలో చర్చించడం జరిగిందని, విశ్రాంత ఉద్యోగులు పాన్ కార్డుకు ఆధార్ లింక్, ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలపై ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించడానికి సంఘం తరపున కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం నేతలు ఆదినారయణ రెడ్డి, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, మస్తాన్ ఖాన్, కాంతమ్మ, సరోజమ్మ, దేవేంద్ర, నాగప్ప, సత్యనారాయణ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



రెడ్డెమ్మతల్లి దర్శనం కోసం క్యూలో భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వర పడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు ఆలయ మెట్లకు పూజలు నిర్వహిస్తూ మొకాళ్లపైనడిచి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టత అందరి బాధ్యత

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పార్టీ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టపరచడానికి పార్టీ శ్రేణులంతా బాధ్యతతో పని చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎం ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులకు సన్మాన కార్యక్రమం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పార్టీ శ్రేణులను పిలుపునిచ్చారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్టుగా ఇద్దామని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ సంస్థల అధ్యక్షులుగా ఎన్నికైన వారు పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తమకిచ్చిన పదవులు కంఠాభరణంలా కాకుండా కష్టపడి పని చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం పార్టీలో జిల్లా అనుబంధ సంస్థల అధ్యక్షులుగా ఎన్నికైన రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హబీబ్‌బాషా, మహిళా అధ్యక్షురాలు మహితా ఆనంద్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యల్లయ్య, ఎస్సీ విభాగం అధ్యక్షుడు రవీంద్ర, వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, తువ్వపల్లె సర్పంచ్ ఆనంద్‌రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



చెర్లోపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

గుర్రంకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పెర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం కోరారు. ఆదివారం మండలంలోని పలుగ్రామాల్లో వారు పర్యటించి పట్టభ్రధులను నేరుగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యాత ఓటు మార్క్ చేయాలని అన్నారు. అనంతరం ఓటర్లకు బ్యాలెట్ నమూనా ప్రతాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల పార్టీకన్వీనర్ ముక్తియార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు గెలిపించాలని కోరుతూ ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణలు ప్రచారం నిర్వహించారు. ఆదివారం వారితో పాటు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుబ్బరాం, సర్పంచ్ చెరువు నరసమ్మ, నాయకులు గొర్ల శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బాబురెడ్డి తదితరులు మండలంలోని కమ్మచెరువు పంచాయతీలో ముమ్మరంగా ప్రచారం చేశారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డి. జాకీర్‌హుస్సేన్

పీలేరు రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణ సాధించాలని జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి డి. జాకీర్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు జీవితంలో మొదటి మెట్టు లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని చదివి పాఠశాలకు, వసతి గృహాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో పీలేరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి జయప్రకాష్, వార్డెన్లు లత, మాధవి, కుసుమ, ఝాన్సీ, రమాదేవి, శంకరయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయి చేష్టలతో అడవికి నిప్పు



కలకడ మండలంలో ఆకతాయిలు పండ్ల తోట కంచెకు నిప్పు పెట్టిన దృశ్యం (ఫైల్)

కలకడ : ఆకతాయి చేష్టలతో కొందరు అడవికి నిప్పు పెడుతున్నారు. మండలంలోని 24 కొండలు, 18 గుట్టలకు నిప్పు పెట్టడంతో అనేక చెట్లు, పక్షులు, మూగజీవాలు కాలిపోయాయి. గత వారం రోజులుగా మండలంలోని బాలయ్యగారిపల్లె మొదలు ఎనుగొండపాళ్యెం పంచాయతీ వరకు అటవీ ప్రాంతంతో పాటు పంటపొలాలు, పండ్లతోటలు సైతం అగ్ని ప్రమాదాలతో దెబ్బతిన్నాయి. రైతులు, మూగ జీవాల కాపరులు అవస్థలు పడుతున్నారు. 25 హెక్టాలలో మామిడి తోటలు, 500 హెక్టార్ల వరకూ అటవీ ప్రాంతంలోని చెట్లు దెబ్బతనగా 2000 వరకు తోటల్లో పెంచిన మొక్కలు కాలిపోయినట్లు రైతులు ఆవదన వ్యక్తం చేస్తున్నారు. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది సైతం సకాలంలో చేరుకోలేకపోవడంతో నష్టాల పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు, నియంత్రణ మార్గాలను చూపి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 13న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లె డివిజన్‌లో మొత్తం 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 51 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల సందర్భంగా డివిజన్ పరిధిలో 500 మంది పాత నేరస్తులు, రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. డివిజన్‌లో 11 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు. ఇందులో భద్రతను పెంచామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ప్రశాంతత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల్లో ఎవరైనా ప్రలోభాలకు గురి చేసినా, నగదు పంపకాలు చేపట్టినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కలకడ : షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మాదిగల సంగ్రామ పాదయాత్ర 9వరోజు కలకడ మండలం యల్లంకివారిపల్లె నుంచి గంగాపురం మీదుగ గుట్టపల్లెకు చేరుకుంది. ఈసందర్భంగా ఆదివారం కలకడలో వారు మాట్లాడుతూ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుంటే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గుడిపాల నుంచి ప్రారంభమైన పాదయాత్ర విజయవాడ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ప్రేమ్‌కుమార్, మండలశాఖ అధ్యక్షుడు హరినాథ, నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, గంగాదర్, వెంకట్రమణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సౌకర్యార్థం బెంచీలు



బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న అటవీశాఖ పర్యావరణ సముదాయంలో పర్యాటకులకు అధికారులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. రాజంపేట డీ ఎఫ్ఓ పళణి వివేక్ ఇటీవల కొండపై పర్యటించి అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పర్యావరణ సముదాయంలో సుందరీకరణ పనులు చేపట్టగా ఇక్కడ సేదతీరే సందర్శకుల కోసం ప్రత్యేకంగా బెంచీలను సిద్ధం చేశారు. వీటిని సందర్శకులు ప్రకృతి అందాలను కూర్చుని వీక్షించేలా ఏర్పాటు చేయనున్నారు. సముదాయంలో అభివృద్ధి కార్యక్రమాలను డీఎఫ్ఓ సూచనలతో నిరంతరం కొనసాగిస్తామని హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఆదివారం చెప్పారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

- –నమాజ్‌తో చెడు ఆలోచనలు దూరం
- –అంగళ్లులో నూతన మసీదు ప్రారంభం



అంగళ్లు కొత్త మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

కురబలకోట: ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని రాయచోటికి చెందిన ముఫ్తి మాసూం ఖాన్, మదనపల్లెకు చెందిన ముఫ్తి షాజహాన్ ఉద్బోధించారు. కురబలకోట మండలం అంగళ్లులో భారత్ కళ్యాణ మంటపం దగ్గర ఆదివారం నూతన మసీదును ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ నమాజ్‌తో చెడు ఆలోచనలు దూరం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ మసీదుకు వెళ్లడమే కాకుండా మంచి మనసు కల్గి ఉండాలన్నారు. మంచి మనసు కలిగిన వారంటే అల్లాహ్‌కు కూడా ఎంతో ఇష్టమన్నారు. మసీదు నిర్మాణం కోసం ఎందరో ఉదారంగా ముందుకు వచ్చి చేయూతను ఇచ్చారన్నారు. మనిషి కష్ట సుఖాలు చెప్పుకునే మార్గమే నమాజ్ (దువా) అన్నారు. భక్తి విశ్వాసాలకు దేవుడి వద్ద ఎప్పుడూ తగిన బహుమానం సిద్ధంగా ఉంటుందన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



రామ్మోహన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరు రూరల్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నిరంతర పోరాటం సాగిస్తోందని యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు సి.వి. రమణ, పి.ఎస్.ఎం. రాజు అన్నారు. ఆదివారం స్థానిక డిపో ప్రాంగణంలో ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షులు పి. రామ్మోహన్ రావు 18వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం కార్మికులకు, పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు నాగరాజ, సుబ్బరామయ్య, హరినాథ, బి.ఆర్.బి. నాయక్, ఆదినారాయణ, ప్రమీల, చాన్‌బాషా, ఆనంద్, ఎం.హెచ్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

- ఆలయ నిర్మాణ పనులు పూరి
- విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు ఏర్పాట్లు



ఆలయ పనులను పరిశీలిస్తున్న ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి తదితరులు

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లి కోటలో వెలసిన శ్రీ సత్యమ్మతల్లి ఆలయం శిథిలావస్తుకు చేరడంతో గత ఏడాది నుంచి కోట ఆవరణలో నూతనంగా సత్యమ్మతల్లి ఆలయంతో పాటు కోట పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ పనులను ఆదివారం ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి గ్రామ నాయకులతో కలసి కోటలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి అయినందున ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నూతన ఆలయం ప్రారంభం, సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయని తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 11వ తేది పుష్పపల్లకిపై సత్యమ్మ తల్లి మూల విగ్రహం మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగింపు, 12వ తేదీ విగ్రహ ప్రతిష్టకు సన్నాహక కార్యక్రమాలు, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు, 13న సోమవారం ఉదయం 6:30గంటలకు సత్యమ్మ తల్లి మూల విగ్రహం ప్రతిష్ట అనంతరం రాత్రికి సత్యమ్మ తల్లి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రపాణి, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నంజీవ రెడ్డి, గంగిరెడ్డి, సత్యపండు, క్రిష్టాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ హెచ్చరిక

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయటమేమనగా మా కక్షిదారుడైన **కలకడ మండలము, కలకడ గ్రామములో వుండు తంబళ్లపల్లి అల్లాబక్ష్ కుమారుడు జిలానీ బాషా** తరుపున ఇస్తున్న ప్రకటన ఏమనగా, అయ్యా, కలకడ మండలము మరియు గ్రామములో సర్వే నెంబరు 213లో ఎకరా 0.81 సెంట్లు విస్తీర్ణము గల భూమిని కాలుభైగారి మూసామియా గారి కుమారుడు రసూల్ బాషా, అబూబకర్ తదితరుల దగ్గర నుండి నా క్లైంటు అయిన **జిలానీబాషా** తేది. **02.02.2005**న విక్రయించుకొని రిజిస్టరు పత్రము పొందియున్నారు. సదరు విక్రయ పత్రములో షెడ్యూలు నందు 4 ప్రక్కల చెక్కుబందులు కనపరచియున్నారు. ఆ చెక్కుబందులకు లోబడివుండిన భూమిని నా క్లైంటుకు **కాలుభైగారి మూసామియా** గారి కుమారులు **రసూల్ బాషా, అబూబకర్** తదితరులు స్వాధీనము చేశారు. అప్పటి నుండి సదరు భూమిని నా క్లైంటు నిరాటంకముగా, ఎవ్వరి దగ్గర నుండి ఎటువంటి ఆక్షేపణ లేకుండా అనుభవించుచున్నాడు. కానీ సదరు విక్రయ పత్రము నందు ఆస్తి షెడ్యూల్‌లో సర్వే నెం.213 బదులు పొరపాటున సర్వే నెం.209గా నమోదు కాబడి వున్నది. కలకడ గ్రామ వాస్తవ్యులైన మిద్దె **సయ్యద్ సాబ్ వలి** మరియు **కరీముల్లా** అనువారు షెడ్యూలు దాఖలా భూమినందు ఎలాంటి హక్కు మరియు అనుభవము లేకున్నను, తప్పుడు పత్రములు సృష్టించి, వాటి అధారముగా షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నించుచున్నారు. కావున ఎవరుకూడా షెడ్యూల్ దాఖలా ఆస్తిని మిద్దె **సయ్యద్ సాబ్ వలి** మరియు **కరీముల్లా** తదితరుల దగ్గర కొనకూడదని హెచ్చరించడమైనది. అట్లు వారిదగ్గర నుండి ఎవరైనా షెడ్యూల్ దాఖలా ఆస్తిని విక్రయించుకున్నచో వారిపై నా క్లైంటు తీసుకోగల యావత్తు సివిలు మరియు క్రిమినలు చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు: అన్నమయ్య జిల్లా, వాయల్పాడు సబ్ జిల్లా, కలకడ రెవిన్యూ గ్రామము, కలకడ మండలము, సర్వే నెం.213 ఎకర 0.81 సెంట్లు.

జి.శివకుమార్ రెడ్డి, అడ్వకేట్, పీలేరు.